# మోక్షం...కథ మొదటికే

## విశ్వనాథం సురేష్



"ఏటే ముక్కా? పిళ్ళకి మవ్వొచ్చావ్? రంగడేడి?" భుజానికున్న నాగలి దించి లంకపొగాకు చుట్ట ఆఖరి దమ్ము పీల్చబోతూ ఆశ్చర్యంగా అడిగాడు చంద్రయ్య.

చంకన బిందెతో బావివైపు వస్తున్న ముక్కకి తండ్రిని చూడగానే తుఫాన్‌లా తన్నుకు వచ్చే దుఃఖం ఆగలేదు. తాను చెప్పే మాటలకు దుఃఖం అడ్డువస్తున్నప్పటికీ దాన్ని దాటుకుంటూ చెప్పడానికి ప్రయత్నించసాగింది ముక్క.

"అయ్యా రంగడు మునుపోడు కాదయ్యా ఆడిప్పుడు పూర్తిగా తాగుడికి, పేకాటకి బానిసయ్యాడు. రోజూ తాగి వచ్చి ఇరుగుపొరుగు వారితో పోట్లాడేవాడు. కాని రాత్రి నన్ను కూడా నానా బూతులు తిడుతూ, అది చాలదన్నట్టు రెండుమూడు సార్లు చెయ్యి కూడా..."

ముక్క సంగతంతా తండ్రితో పూసగుచ్చినట్టుగా చెప్పసాగింది. ఒకే ఊర్లో ఉన్నప్పటికి కూతురు చెప్పేంతవరకు సంగతంతా తెల్సుకోనందుకు సిగ్గుపడ్డాడు చంద్రయ్య.

ముక్కకి రాత్రంతా నిద్రలేదని ఆమె కళ్ళే చెపుతున్నాయి. కూతురి కన్నీళ్ళు తుడుస్తూ "దానికి పరిష్కారం ఆలోచిస్తామ" అన్నట్టుగా తలూపుతూ నాగలి భుజానికెత్తుకొని పొలంవైపు నడిచాడు చంద్రయ్య.

** ** **

చంద్రయ్యకు ఇద్దరు కూతుళ్ళు. పరువుకోసం ప్రయాసపడే చంద్రయ్య మొదటి కూతురు వివాహం ఆ ఊర్లోనే ఉండే రంగడితో జరిగింది. రంగడి సత్ప్రవర్తన గూర్చి అతని చిన్ననాటి నుంచి ఆ ఊరంతా తెలుసు. అందుకే చంద్రయ్య ముచ్చటపడి రంగడ్ని అల్లుణ్ని చేసుకున్నాడు కాని రంగడు ఇలా మారతాడని చంద్రయ్య ఊహించలేదు.

చంద్రయ్య ఆలోచనంతా ఇప్పుడు ముక్కమీద లేదు. ఉదయం రెండో కూతురు పద్మకోసం వచ్చిన సంబంధం గూర్చి ఆలోచించసాగాడు చంద్రయ్య. తన మొదటి కూతురు విషయంలో ఎదురైన చేదు అనుభవాన్ని ఆసరాగా తీసుకొని కనీసం పద్మకు సరైన న్యాయం చేకూర్చాలని అతని తాపత్రయం. అబ్బాయి అందగాడు కానీ కట్నం అక్కర్లేదట. అతని చదువు సంధ్యతోబాటు పట్నంలో చిన్న ఉద్యోగం కూడా ఉందట.

** ** **

పద్మ వివాహం భాస్కర్‌తో ఘనంగా జరిగింది. చంద్రయ్య పట్నం అల్లుణ్ని చూసి ఆ ఊర్లో సంతోషించని వారు లేరు.

** ** **

వారం రోజులు పుట్టింట్లో గడపడానికి వచ్చిన పద్మలో మార్పు గ్రహించాడు చంద్రయ్య. తనలో తానే బాధపడుతుంది. అల్లుణ్ణి గూర్చి అసలు చెప్పదు. అలవాటు లేని వాతావరణానికి కూతురు అలా అయి వుందని తనకి తానే సర్ది చెప్పుకున్నాడు చంద్రయ్య.

** ** **

రోహిణి కార్తె ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. ఆ రోజెందుకో పనివల్ల పట్నం రావలసి వచ్చింది చంద్రయ్యకు. వచ్చిన పని జరగడానికి ఒంటి గంట పట్టింది. ఆకలికి కడుపులో ప్రేగులతో పాటు, ఎండకి తలకూడా మాడసాగింది.

ఎదురుగా కనిపిస్తున్న హోటల్ "ఆనంద్ భవన్" లోకి నడిచాడు చంద్రయ్య. రెండుగ్లాసుల చల్లని నీరు త్రాగేసరికి కొద్దిగా స్థిమితపడ్డాడు చంద్రయ్య.

"ఇడ్లీ, వడ, ఉప్మా, దోసె... ఏది తెమ్మంటారు" నిర్లిప్తంగా అడుగుతున్న సర్వర్‌ను చూసి చంద్రయ్యకు నుదుట చెమట పట్టింది.

సర్వర్ డ్రెస్‌లో ఉన్న తన రెండో అల్లుడు భాస్కర్‌ను గుర్తించడానికి చంద్రయ్యకు నిముషం పట్టింది.

○

